నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి, కొండాపూర్ డివిజన్ల పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు నాగేందర్‌యాదవ్, హమీద్‌పటేల్ శంకుస్థాపన చేయనున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల ఆధ్వర్యంలో రెండు డివిజన్లల్లో కలిపి రూ.23.10 కోట్ల వ్యయంతో చేపట్టే సీసీరోడ్లు, వరదనీటికాల్వ పనులను వారు ప్రారంభించనున్నారు.

ఎలక్ట్రికల్ వాహనాలకు మంచి డిమాండ్: మంత్రి పొన్నం



ఎలక్ట్రికల్ స్కూటర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చందానగర్: రానున్న కాలంలో ఎలక్ట్రికల్ వాహనాలకు మంచి డిమాండ్ ఉండనుందని రాష్ట్ర రవాణా, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని న్యూహఫీజ్‌పేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఎలక్ట్రికల్ స్కూటర్స్ షోరూమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఎలక్ట్రికల్ స్కూటర్స్‌ను ప్రజలకు అందుబాటు ధరల్లో అందించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


వరదనీరు సాఫీగా వెళ్లేలా కృషి



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శిల్పా బృందావనంలో వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో సమస్యగా ఉందని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా ఆయన ఆదివారం జీహెచ్‌ఎంసి సిబ్బందితో కలిసి సమస్యను పరిశీలించారు. వరద నీరు సాఫీగా వెళ్లేలా కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం శిల్పా బృందావనంలో వరదనీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటికే వరద నీటి డ్రైనేజీ నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వెంటనే నిర్మాణ పనులు మొదలు పెట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.


యువత క్రీడల్లోనూ రాణించాలి



కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: యువత క్రీడల్లోనూ రాణించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆధ్వర్యంలో జయనగర్ కాలనీలోని ఏఎంవై స్పోర్ట్స్ అరెనా కాంప్లెక్స్‌లో ఆదివారం ఎన్‌వీఆర్ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆటల్లో గెలవటం కంటే గెలుపుకోసం చేసే ప్రయత్నం గొప్పదన్నారు. కార్యక్రమంలో శ్రీహరియాదవ్, గోపాల్‌రావు, నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, భాస్కర్ గౌడ్, వీరు యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు రేషన్ రాజు, వేణు, నాగేందర్ రెడ్డి, లక్ష్మణ్, విష్ణు, ఆంజనేయులు యాదవ్, భాస్కర్ గౌడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్ బలరామమూర్తి మృతి



మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం మాజీ చైర్మన్ బలరామమూర్తి శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు బలరామమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుమ్మడిదల సుధాకర్ మాట్లాడుతూ బలరామమూర్తి రెండు పర్యాయాలు ఆలయ కమిటీ చైర్మన్‌గాను సభ్యుడిగా పనిచేశారని గుర్తు చేశారు.

రోడ్లపై పారుతున్న మురుగు..

- వారం రోజులుగా ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు
- పరిష్కారం చూపని అధికారులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ తులసీనగర్‌లోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వీధిలో వారం రోజులుగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మురుగునీరు ఏరులై పారుతుంది. సమీపంలో ఉన్న భూదేవిహిల్స్, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లు, జగద్గిరిగుట్ట నుంచి వెలువడే మురుగునీరు తులసీనగర్ డ్రైనేజీలో కలుస్తున్నది. పైపులైన్ సామర్థ్యం చిన్నగా ఉండటం, వర్షం నీటిలో కొట్టుకువచ్చిన వ్యర్థాలు డ్రైనేజీ పైపులైన్‌లో చేరడంతో అండర్ గ్రౌండ్ మ్యాన్‌హోల్స్ నిండిపోయి రెండు కిలోమీటర్ల మేర డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది పగలు, రాత్రి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దుర్గంధం, దుర్వాసనతో దగ్గు, జలుబు విష జ్వరాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని తులసీనగర్ వాసులు కోరుతున్నారు.



తులసీనగర్‌లో కిలోమీటర్ల మేర రోడ్డుపై ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు

పాటలతో మార్మోగిన అపర్ణా నియో మాల్

ఆలపించిన ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్లై

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణా నియో మాల్‌లో జరుగుతున్న ఎన్‌ఈఓఎస్‌ఎస్ షాపింగ్ ఫెస్టివల్‌లో తొలిసారిగా ఒక సెలబ్రిటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్లై తన పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఆమె లైవ్ పర్ఫార్మెన్స్ చూడటానికి వచ్చిన వందలాది మంది అభిమానులతో మాల్ మొత్తం సందడిగా మారిపోయింది. పాటలు, నృత్యాలతో షాపింగ్ ఫెస్టివల్ మరింత కళను సంతరించుకుంది. ఆగస్టు 17వ తేదీ వరకు ఈ ఫెస్టివల్‌లో షాపింగ్ చేసేవారికి బంపర్ ఆఫర్లు లక్కీ డ్రాను నిర్వహిస్తారు. ఒక ముందు కూడా ఈ షాపింగ్ ఫెస్టివల్‌లో ఎన్నో ఆసక్తికరమైన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆగస్టు 14, 15 తేదీల్లో జానపద నృత్యాల ఫెస్టివల్, ఆగస్టు 16న అద్భుతమైన శాండ్ ఆర్ట్ ప్రదర్శన వంటి ఈవెంట్లను ఏర్పాటు చేసినట్లు వారు వివరించారు. ఈ సారి సిటీలో జరుగుతున్న అత్యంత డైనమిక్ షాపింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్‌గా ఇది నిలుస్తుందని స్పష్టం చేశారు.



నల్లగండ్లలోని అపర్ణానియోమాల్‌లో షాపింగ్ ఫెస్టివల్‌లో ప్లేబ్యాక్ సింగర్ భార్గవి పిళ్లై

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రిన్సిపాల్ శ్రీనివాస్



పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇచ్చి జాబ్‌మేళా నిర్వహించి ఉపాధి కల్పించడంతో కళాశాలకు అడ్మిషన్లు పెరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో డిజిటల్ ల్యాబ్‌లు, డిజిటల్ తరగతులు, అంకితభావం కలిగిన బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయి. యూనివర్సిటీ పరీక్షల్లో అద్భుతమైన ఫలితాలు సాధించారని తెలిపారు. ఏడాది కళాశాలలో ఇప్పటికే బీకాంలో 261, బీబీఏలో 51, బీఏలో 87, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో 86, ఫిజికల్ సైన్స్‌లో లో 87 ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకున్నారు. అలాగే, లాస్ట్ ఫేజ్‌లో అడ్మిషన్లు పొంది 70 మంది జాయిన్ కావడానికి సిద్ధంగా ఉన్నారని, మొత్తం కళాశాల అడ్మిషన్లు 650 నుంచి 700కు చేరుకునే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



విరాళం అందజేస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మంత్రికుంటలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించారు. ప్రతిష్ఠ ఉత్సవాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి గోవర్ధన్ రెడ్డి లక్ష రూపాయల విరాళం కమిటీ సభ్యులకు అందజేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ నెలకొంటుందన్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, ప్రకాశం చారి, సురేందర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఆటోలో 'నగదు బ్యాగ్'మరిచిపోగా..

కేపీహెచ్‌బీకాలనీ: ఆటోలో పొరపాటున నగదుతో కూడిన బ్యాగ్‌ను మరిచిపోయిన బాధితులకు పోలీసులు స్పందించి బ్యాగును అందజేశారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. జగద్గిరిగుట్ట, లెనిన్ నగర్‌కు చెందిన లావణ్య, కృష్ణప్రియ ఇద్దరు అక్కాచెల్లెళ్లు. షాపింగ్ నిమిత్తం లెనిన్ నగర్‌లో ఆటో బుక్ చేసుకుని కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1కు వచ్చారు. ఆటోలో నగదుతో కూడిన బ్యాగ్ మరిచిపోయారు. ఆ తరువాత బ్యాగ్ ఆటోలో వదిలివేయడాన్ని గుర్తించి కేపీహెచ్‌బీ పోలీసులకు తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి ఆటోను గుర్తించారు. డ్రైవర్‌ను పిలిపించి బ్యాగును వారికి అప్పగించారు. బ్యాగులో లక్షా ఇరవై వేల రూపాయలు ఉన్నాయి. తక్షణమే స్పందించిన ఎస్‌ఐ లింగం, కానిస్టేబుల్ అనిల్‌ను సీఐ రాజశేఖర్ రెడ్డి అభినందించారు.



డ్రైనేజీ మరమ్మతులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ అనే శీర్షికతో ఆదివారం కూకట్‌పల్లి సాక్షి జోన్‌లో ప్రచురితమైంది. దీంతో సంబంధిత జలమండలి ఇన్‌చార్జి మేనేజర్ అన్విత్ కుమార్ స్పందించి డ్రైనేజికి ఆదివారం మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా డ్రైనేజీలోకి తినుబండారాలు, ఆహార పదార్థాలు వేయకుండా హోటల్ యజమానిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాకుండా డ్రైనేజీకి శాశ్వత మరమ్మతులు చేపడతామని తెలిపారు. ప్రత్యేక డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేసుకోవాలని హోటల్ యజమానికి ఆదేశించారు. లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్



మరమ్మతులు చేయిస్తున్న ఇన్‌చార్జి మేనేజర్ అన్విత్‌కుమార్

ఆత్మీయ సమావేశం

మూసాపేట: కూకట్‌పల్లిలోని సెంట్రింగ్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను అభినందించారు. సెంట్రింగ్ కార్మికులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో తుకారం, యూనియన్ అధ్యక్షుడు సత్యం, సభ్యులు నారాయణ, పాల్గుణరావు, లక్ష్మీనారాయణ, తేజ, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేడు వైభవలక్ష్మి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

రాయదుర్గం: వైభవలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యుడు భరత్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం రాయదుర్గంలోని వైభవలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు కృష్ణగౌడ, సతీష్‌గౌడ్, శ్రీరామ్‌గౌడ్ పర్యవేక్షణలో అర్చకులు ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యహవచనం, ప్రథమ కలశ పూజ, ఉదయం 8 గంటలకు వైభవలక్ష్మి శాంతి హోమం, 10 గంటలకు నవకలశ స్థాపన అభిషేకం, 11.30 గంటలకు లక్ష్మీనారాయణ కల్యాణం, శ్రీనివాస కల్యాణం కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని ఆయన సూచించారు.

రాజేందర్‌రెడ్డి కాలనీ అధ్యక్షుడిగా రఘుపతిరెడ్డి ఎన్నిక



రాజేందర్‌రెడ్డి కాలనీ నూతన కమిటీ సభ్యులు

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డి కాలనీ నూతన అధ్యక్షుడిగా రఘుపతిరెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన ఎన్నికల్లో రఘుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దత్తు, ట్రెజరర్‌గా మల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథ్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ లింగారెడ్డి, బాలజీ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, లక్ష్మణ్ కుమార్, సత్యనారాయణ రెడ్డి, జగన్మోహన్ రావు, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కర్నాకర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిలుగా వెంకట నర్సింహులు, పూర్ణచందర్‌రావు, సంతోష్‌రెడ్డి, రఘునందన్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నారాయణ మూర్తి, చెన్నారెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీమూర్తిలను ఎన్నుకున్నారు.

శివశంకర్‌కు ఘన నివాళి



కూకట్‌పల్లి: హిందూ బీసీ మహాసభ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో దివంగత నేత పుంజాల శివశంకర్ జయంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత సతీష్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా దేశంలో క్లిష్టమైన పరిస్థితుల్లో స్వర్గీయ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీకి ప్రత్యేక సలహాదారుడిగా ఉంటూ దేశం కోసం ఎంతో కృషి చేశారన్నారు. అదే విధంగా బీసీ సంక్షేమం కోసం ఎన్నో కొత్త చట్టాలను, రిజర్వేషన్‌ను అమలు చేయటంలో తనదైన శైలిలో సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా కార్యక్రమాలను చేపట్టారన్నారు. కార్యక్రమంలో బీసీ ఉద్యమ నాయకులు అమరేంద్ర, హిందూ బీసీ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర పటేల్, కోలా జనార్దన్, అంబేడ్కర్ ఆజాద్ అధ్యక్షులు కొంగర నరహరి, హిందూ బీసీ మహా సభ ప్రధాన కార్యదర్శి చింతలగారి వెంకటస్వామి, కందికట్ల నరసింహ, బత్తుల రాంనర్సయ్య, జక్కుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, పీఏజేఆర్ నగర్ కాలనీకి చెందిన మొగులయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డీవీజీ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్. భాస్కర్, అగ్రవాసు, మహేష్, సుధాకర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి

ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఉషోదయ ఎన్‌క్లేవ్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీకి కాలనీవాసులు ఆదివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక వసతులు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేకు తెలిపారు. అదే విధంగా కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, అవసరమున్న చోట యూజీడీ పైప్ లైన్‌లు వేయాలన్నారు. వరద నీటి కాల్వ నిర్మాణం చేపట్టాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మాట్లాడుతూ త్వరలోనే ఉషోదయ ఎన్‌క్లేవ్ కాలనీలో పర్యటించి నెలకొన్న సమస్యలను పరిశీలిస్తానన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామన్నారు. దశల వారీగా పూర్తి స్థాయిలో పనులు చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాలనీలో అవసరమున్న చోట వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని, అవి సక్రమంగా వెలిగేలా చూడాలని అధికారులకు తెలియజేశామన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

రానున్న రోజుల్లో సేవలను విస్తృతం చేస్తాం

హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ విజయ్‌కుమార్



స్థానికులకు టిఫిన్ బాక్స్‌లు, బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ విజయ్‌కుమార్



మాదాపూర్‌లోని వార్డు కార్యాలయంలో ..

చందానగర్: తమ ఫౌండేషన్ సేవలను రానున్న రోజుల్లో మరింత విస్తృతం చేస్తామని హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కొండ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. హోప్ ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం చందానగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవంలో వ్యవస్థాపకుడు స్థానికులకు టిఫిన్ బాక్స్‌లు, బ్యాగ్‌లను అందజేశారు. హోప్ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో హోప్ ఫౌండేషన్ గత 10 వసంతాల నుంచి నిరుపేదలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అపర్ణ, సందీప్, లయన్స్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, గాలి కృష్ణ, మధుసుదన్‌రెడ్డి, భీమ్‌రావు, మారం వెంకట్, నూకల సందీప్, బర్క మల్లేష్‌యాదవ్, విజయ్ భాస్కర్, విష్ణుమూర్తి, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

మాదాపూర్: హోప్ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మాదాపూర్ వార్డు కార్యాలయంలో ఆదివారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు చీరలను అందించడంతో పాటు అల్పాహారాన్ని అందించారు. కార్మికులతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ కట్ చేశారు. అనంతరం ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో అపర్ణ, మధుసూదన్‌రెడ్డి, సందీప్, మల్లేష్‌యాదవ్, విష్ణుమూర్తి, స్థానికులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే లక్ష్యం



మాత్రలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: బాల బాలికల్లో నులి పురుగుల సమస్య నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతియేటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ ఫైలేరియా, నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు ప్రభుత్వ ఐడియా ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రెండు విడతల్లో నులి పురుగు నివారణ మాత్రలు ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి నిర్మల, డాక్టర్ మనోహర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ఆస్పత్రి అభివృద్ధి సంఘం సభ్యులు కంకర శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

ఫైలేరియాపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): ఫైలేరియా నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బోధకాల వ్యాధి నిర్మూలనలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ దోమడుగులో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గుమ్మడిదల పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని గ్రామాల్లో ఈ నెల 10 నుంచి 25 వరకు రెండు సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే అందజేయనున్నట్లు మండల వైద్యాధికారి మధుకర్ తెలిపారు. ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలను వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సైదులు, వీరేశం, హెచ్‌ఈఓ శ్రీనివాస్, వైద్యబృందం భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, వానకుమారి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కాలనీ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీపురం కాలనీ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్స్



పాల్గొన్న క్రీడాకారులు

నిజాంపేట్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ కబడ్డీ లీగ్ ఫైనల్ రౌండ్ సెలక్షన్స్ విజయవంతంగా పూర్తైంది. మొత్తం 220 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. కఠినమైన ఎంపిక ప్రక్రియ అనంతరం అన్ని విభాగాల నుంచి 8 జట్లు ఎంపికయ్యాయి. కార్యక్రమానికి తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, సెలక్షన్ కమిటీ చైర్మన్ అజీజ్‌ఖాన్, సెలక్షన్ కమిటీ సభ్యులు, టెక్నికల్ అధికారుల పర్యవేక్షణలో ఈ ఎంపిక కార్యక్రమం జరిగింది. తెలంగాణ కబడ్డీ లీగ్ ఆగస్టు 28 నుంచి ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు.